ఇంతలో ఎవరో కాకీ పేంటూ, నల్లకోటూ తొడుక్కున్నా యన – ఎవరో ఏ.పి.పి. గారట– "ఒకటి వాళ్ళదని ఒప్పుకుం టావు కదా! అది చాలు" అన్నాడు. నేను అతనికేదో యిస్తున్నట్టు మేజ్స్ట్రేటుగారు వెంటనే తీర్పు చెప్పేశారు. "నన్ను ఏవో సెక్షన్ల క్రింద దోషిగా భావించేరని, కాని ప్రథమనేరం అవడంవల్ల ఒక సంవత్సరం ప్రొబేషనుమీద వదిలేస్తున్నారని ఆ సంవత్సరం నేను నేరాలు చెయ్యకుండా బుద్ధిగా మంచి నడవడి కలిగి వుండాలని ఆ తీర్పు".

కథ ముగిసిపోయినట్టే, ఆ సంవత్సరం అయిపోయేక విచ్చల విడిగా, ఆవారాలా దొంగతనాలూ, ఖూనీలు చేసినా పద్ధతికీ, చట్టానికి వ్యతిరేకం కాదన్నమాట అనుకుంటూ, ఎవరో జామి నుదారుని కుదుర్చుకొని పూచీకత్తుమీద సంతకం పెట్టేను" అంటూ కథ ముగించేడు డాక్టర్.

"ఐతే మా డిపార్టుమెంటు చురుక నీక్కూడా తగిలిందన్న మాట" అన్నారు జడ్జిగారు నవ్వుతూ.

"లక్ష్మికి చావు తప్ప మీకు కన్ను లొట్టపోయిందందురూ" అన్నాడు తనూ నవ్వుతూ, అంతవరకూ పలుకే బంగారమైన శంకర్రావు.

"ఇప్పటికైనా జనగణమన పాడొచ్చా? లేకపోతే యింకా వుందా కాశీ మజిలీ?" అంటూ లేచేడు విశ్వనాథం.

**(జ్యోతి మాసపత్రిక, 1.3.1965)**

# కుంకుమ ఖరీదు పదివేలు ...?

"**మా**కు హిందీ వద్దే వద్దు" తమిళులు.

చౌదరీ ఎండ్ చౌదరీ ప్రఖ్యాత పుగాకు కంపెనీ.

"హిందీ కావాలని మేమూ అనం" ఆంధ్రులు.

చౌదరీ ఎండ్ చౌదరీలో ఒక చౌదరీ చచ్చే పోయేడు.

చౌదరీ ఎండ్ చౌదరీ లక్షలు గడించిన సంస్థ, రెండవ తరం ప్రొప్రయిటర్లు యిద్దరూ పిన్తండ్రి పెత్తండ్రి పిల్లలు.

పెత్తండ్రి కొడుకు రాఘవయ్య చౌదరీకి పుగాకు వ్యాపారం సరిపడలేదు. ఆ వాసనే గిట్టలేదు. సినిమా వాసన బాగా గిట్టింది. అంచేత తండ్రి పోయేదాకా పుగాకు ఇంపు భరించి, తండ్రి చనిపోగానే పుగాకుడబ్బు లక్షపట్టుకుపోయేడు. హైదరాబాదు– లక్షలున్న పాత స్నేహితులు విశ్వనాథాన్నీ సుబ్బారావునీ కట్టుకుని మరీపోయేడు. ముగ్గురూ సినిమా కంపెనీ పెట్టారు తలో లక్షా పెట్టుబడి, "ట్రయో పిక్చర్స్" అని పేరు పెట్టారు దానికి.

పిన్తండ్రి కొడుకు రామయ్య చౌదరీకి సినిమా లిష్టమున్నా: పుగాకు వ్యాపారమంటే యింకా ఎక్కువిష్టం, అతన్ని విదేశాలు తీసుకెళ్ళిందా వ్యాపారం. ఇంద్రుడికీ ఇన్ కంటాక్సు వాళ్ళకీ దొరక్కుండా కంపెనీ నడుపుకుంటూ స్వంత వూళ్ళోనే వుంటాడు. హైద్రాబాద్‌లో లేనన్న విచారమతనికి లేదు. చాకచక్యం వుంటే తన రెండంతస్తుల మేడలో ఒక అంతస్తులో హైద్రాబాదూ, మరో అంతస్తులో హాలీ వుడ్డూ పెట్టుకోవచ్చునన్న నమ్మకం ... ఆ చాకచక్యం కూడా ఉన్నాయతనికి.

ఇంటికి నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న కంపెనీకి తెరచాప లేని పడవలావున్న తన కన్వర్టిబుల్ కారులో వెళ్ళి సాయంత్రం యిల్లు చేరుకోవడం, తర్వాత మూడ్ని బట్టి హైద్రాబాదు అంతస్తు లోకో, హాలీవుడ్ అంతస్తులోకో వెళ్లి పోవడం అతని అలవాటు.

తొమ్మిది నెలలవగానే ట్రయోపిక్చర్సు ఆంధ్రప్రేక్షక లోకానికి ఒక క్రైమ్‌త్రిల్లర్ అందించింది. దాంతో ఆంధ్ర చలనచిత్ర చరిత్ర మారిపోతుందని ప్రేక్షకలోకం అన్లేదు. కాని, మూడులక్షలు లాభం తాంబూలంలో పెట్టి యిచ్చింది. తాంబూలం పుచ్చు కున్నాక. మహోజ్వల చిత్రం ప్రేక్షకులకి ప్రామిస్ చేశారు పార్ట్నర్స్, భారీ ఎత్తుహిందీ టెక్నికల్ చిత్రానికి ప్లానుగీశారు. ఒక హిందీ ఆడతార బ్లాక్ మనీ ఎనిమిది లక్షలడిగి దానికి ఒప్పుకుంటే పగటి ధర చెప్తానంది. వెంటనే ఎత్తు విరమించు కొన్నారు పార్ట్నర్స్, సంగీత నృత్య ప్రధాన తెలుగు చిత్రమే తీయదల్చేరు.

"మన రెండో పిక్చరు నేను డైరెక్టు చెయ్యడం ఖాయం" అన్నాడు విశ్వనాథం.

"నేను హీరో వెయ్యడం యింకా ఖాయం" అన్నాడు సుబ్బారావు.

"నేను పాటల రాయడం మరీ ఖాయం' అని అన్లేదు రాఘ వయ్య అందామని వున్నా.

తాను హీరో వేసినా మానినా విశ్వనాథం డైరెక్టు చేయడానికి వీల్లేదన్నాడు సుబ్బారావు. తాను డైరెక్టు చేయడమన్నా మాను కుంటానుగాని సుబ్బారావు మొహానికి రంగేసుకోడానికి ఊపి రుండగా ఒప్పుకోనన్నాడు విశ్వనాథం. వీళ్ళిద్దరూ ఆ రెండు

పనుల్లో ఏది చెయ్యడానికీ, ఊపిరిపోయినా ఒప్పుకోనన్నాడు రాఘవయ్య– ట్రయోపిక్చర్సు బద్ధలై పోతుందన్నారంతా,

"బద్ధలైనా ఎంచక్కా ఓ చెక్కా పట్టుకుపోయి సోలో ఫిలిమ్స్ పెట్టి డబుల్‌రోల్ వేసేస్తా, హీరో, విలన్నేనే, ఇంకేదవండి" అని వార్ డిక్లేర్ చేశేడు సుబ్బారావు.

"నీ మొహం సినిమా ఎవరూ చూడరు" శపించేడు విశ్వనాథం.

"ఓ హాలు అద్దెకు తీసుకుని నెలకోసారి వేసుకుని నే నొక్కడినే చూసుకుంటూ. ఇప్పుడేనా ఏడవండి" అంటూ యుద్ధం సాగిస్తూనే వున్నాడు సుబ్బారావు.

సుబ్బారావు రెండుసార్లు నొక్కిచెప్పినా ఏడవకుండా అతని పార్ట్నర్స్ పాత డైరెక్టరు దగ్గిరికి పరిగెత్తేరు. అతను వార్ని కొత్త హీరోయిన్దగ్గరికి పరిగెత్తించేడు. వారం రోజుల్లో పార్ట్నర్సుని రాజీ చేశేరు డైరెక్టరూ హీరోయిన్నూ, సుబ్బారావు హీరోయిన్ అన్న వేషం వెయ్యడానికీ, విశ్వనాథం డైరెక్టరుకి అసిస్టెంటుగా వుండి పోవడానికీ, వీళ్ళిద్దర్నీ అలా చూస్తూ చంపేయకుండా రాఘవయ్య వుండిపోడానికీ సామరస్యం కుదిరిపోయింది. ఫలితంగా ఆర్నెలల్లో ప్రేక్షకుల ఒళ్ళో వాలింది ఆటాపాటా వచ్చిన 'రాగమయి'.

"వాలు! వాలు!! ఎంత బావుందెంత బావుందీ !!!" అన్లేదు ప్రేక్షకులు

"గెఠవుట్" అన్నారు ముక్తకంఠంతో.

"ఉడతలుపట్టేవాళ్ళా మొహం వీడూనూ ! వీడెక్కడి హీరో దొరికేడు మనకి" పార్ట్నర్స్‌ని ఎత్తిపొడిచేడు సుబ్బారావు. వాళ్ళకి తెలీకుండా పత్రిక వాణ్ణొకణ్ణికొని 'హీరోయిన్ అన్నకి మంచి ఫ్యూచర్ వుం'దని ఆ పత్రికలో రాయించేసుకున్నాడు.

"యీ ముసలిగాడిదకొడుకు డైరక్టరొద్దు, నేనే డైరెక్టు చేస్తానంటే విన్నారానాన్నలూ?" అని తనవంతు కూడా తీర్చుకున్నాడు విశ్వనాథం. 'డైరెక్టరు మాటెలావున్నా అతని అసిస్టెంటుకి మంచి ఫ్యూచర్ వుం'దని పత్రికలవాళ్ళని కొన్నా రాయించుకోడానికి వీల్లేక వాళ్ళని కొండమే మానేశాడు.

రెండువారాల్లో 'రాగమయిని' విడివిడిగా 22 ఇన్‌ప్పెట్టెలలో పెట్టి వాపసు చేశేడు ప్రతి ఎగ్జిబిటరూ. మొదటి పిక్చరు లాభం యావత్తుకూ రాగం పాడింది 'రాగమయి'. మూలధనంలో మూడు వంతులికి కాళ్ళొచ్చేయి. కార్లలో ట్రయో బయల్దేరేరు యిళ్ళకి, మళ్ళీ మూణ్ణెల్లలో తలో లక్షా పట్టుకొని హైద్రాబాదు వద్దామని ప్రతిజ్ఞచేసి.

ఆ రాత్రి సూటిగా అడిగేశాడు రాఘవయ్య 'నాకు అర్జంటుగా ఆధమం ఒక లక్ష కావాలి' అని.

'ఐ.పి. పెట్టకుండా వుండాలంటే నాకూ కావాలి ఐదులక్షలు ఎమర్జంటుగా' –బదులు చెప్పేడు రామయ్య.

క్షణం ఆగి 'కానినేనడగటానికి కెవరూ పిన్తండ్రి కొడుకుల్లేరు. నీకేం తెలుసు నా బాధ? హాయిగా హైద్రా బాదులో కూర్చున్నావు! నేన్ చస్తున్నా యీకంపెనీతో వేగలేక. పదేళ్ళ లెక్కలు తిరగేసి పెనాల్టీతో సహా లక్షాముప్పాతిక కట్టమంటున్నాడా రాక్షసుడు; ఇన్‌కమ్ టాక్సాఫీసరుకాద్రా బాబూ వాడు ! కలిపురుషుడు ! ! ఇక సేల్స్‌టాక్సాపీసరంటావా?–వాడికీ యముడికి ఎనుబోతే బేధం. లీగల్ గానూ యిల్లీగల్ గానూ నా రక్తం తాగేస్తున్నాడు. మూడేళ్ళస్టాకు గోడౌన్‌లో ముక్కి పోతుంది. కొసరి మిస్టాకే కొంటామంటూ దగా చేసిందా దగాకోరు రష్యా. కాటిదగ్గర నక్కల్లా కాచుక్కూర్చున్నారు రైతులు ధరచెల్లించమని నేన్ చెయ్యలేన్రా బాబూ యీ టొబాకో బిజినెస్. నువ్వుచెయ్యి. నువ్వే చేసుకో నాకోలక్షపారేయ్. నేనే సినిమా తీసుకుంటాను' అన్నాడు.

ఏమి లేకపోయినా సర్దుకు పోతాడుకాని రాఘవయ్య లక్షచేతిలో లేందే బతకలేడు. ఇద్దరూ మాటామాటా హెచ్చేరు. రాఘవయ్య చెడీమన్నాడు. రాఘవయ్య ఫెడీ మన్నాడు.

పిచ్చి పట్టినట్టయింది రాఘవయ్యకి. భరించలేక లేచి పోయేడు.

❖ ❖ ❖

పంకజాన్ది పట్నానికి పదిమైళ్ళ దూరంలోవున్న మరో చిన్న పట్నం. పదిహేనేళ్ళు వెళ్ళగానే వంశపారంపర్యంగా వస్తున్న వృత్తిలో ప్రవేశించింది. పదేళ్ళలోనే పెద్దలు చాలా మంది పరిచయస్తులయ్యేరు. పేవ్‌మెంట్లకి దిగజారకుండా సినిమాలకెగబడకుండా సాధ్యపడే ఆశలూ, ఆశయాలు మాత్రం పెట్టుకొని బతికే మనిషామె.

ఆమె తెల్లని గుండ్రని మొహంచుట్టూ ఒక చేత్తో సున్నాలు చుడ్తూ రెండో చేత్తో ఆమె నల్లటి కురులు నవరిస్తూవుంటే, నల్లని మేఘాల్ని విదిలించుకుంటున్న నిండు చంద్రుడు గుర్తు కొస్తాడు రాఘవయ్యకి, 'రాగమయి'కి అతను మనసులో రాసుకున్న తీమ్‌సాంగ్‌లో సెంట్రల్ ఐడియా అదే.

ఇంకెవర్నీ ఆ చందమామని తాకనీయకుండా వుండడానికి, వేరెవర్నీ ఆ మబ్బులో వేళ్ళు గుచ్చనీయకుండా వుండడానికి పంకజం పెట్టిన షరతు, నెలకి నూట యాభై రూపాయలు. ఆనందంతో అంగీకరించి పాటిస్తున్నాడు రాఘవయ్య.

ఇదంతా జరిగిపోయి చాల్నాళ్ళయింది. లక్షాదొరకని నాటిరాత్రి రాఘవయ్యకి పిచ్చి పట్టినట్టయింది. పిచ్చి తగ్గాలంటే రెండే మార్గాలు. ఒకటి విస్కీ, రెండోది పంకజం. మొదటిదారి రెండోదానికి పూలబాటైంది, మత్తుగా పంకజం ఒళ్ళో వాలి పోయేడతను.

సినిమా సరుక్కి అలవాటైన రాఘవయ్యకి పంకజాన్ని చూడ గానే చిరకాలం క్రిందట పోగోట్టుకున్న సెంటిమెంటల్ వాల్యూ గల వస్తువు దొరికినట్టయింది. కాగితం పూలమ్మేవాడు గులాబీ తోటలోకి వెళ్ళినట్లయింది. చిన్నపిల్ల బొమ్మతో ఆడుకున్న ట్టాడుకున్నాడామెతో. కూర్చోపెట్టేడు. పడుకోమన్నాడు. నిలబడ మన్నాడు. మాటాడమన్నాడు. మాటాడొద్దన్నాడు...

పిచ్చి కొంత తగ్గినట్టయింది. లక్ష లేకపోయినా ఇంకో న్నాళ్ళు బతకొచ్చనిపించిందతనికి. రాత్రి మూడయ్యేక కార్లో బయిల్దేరాడు తనూరు.

❖ ❖ ❖

ఏ.యస్.పి. నాయరు తెలివైనవాడు. దొంగల్నెవర్నీ అతడు పట్టుకోలేదు; పట్టుకోనవసరం లేదు, కాని తన సబార్డినేట్సులో పనికొచ్చే వాళ్ళని దొంగల్ని పట్టినట్టు పట్టేస్తాడు. అలా అతనికి దొరికిపోయేరు. యస్.ఐ. సుబ్రహ్మణ్యం, సర్కిల్ రాజూను.

ఏ.యస్.పి. గారికి రాత్రల్లా నిద్రలేదు. దేముడూ గుండాలూ కరుణించబట్టి యింతవరకూ శాంతంగానే వుంది తన టౌను. కాని ఆ శాంతి తాత్కాలికమనీ, ఐదుకాలేజీలూ పెద్ద రైల్వే స్టేషనూ, ప్రఖ్యాత ఫ్యాక్టరీలు వున్న తన టౌనులో అలజడి ప్రారంభం కాక మానదనీ అతనికి తెలుసు. మద్రాసు రాష్ట్రంలో హిందీ వద్దని బీభత్సం రేగింది. ఆ చిచ్చు తన టౌనుకి కూడా పాకక మానదు.

నాయరుకి ఇంగ్లీషంటే ప్రత్యేకాభిమానం లేదు; హిందీ అంటే ఏవగింపూ లేదు. ఏ భాషైతే ఏవిఁటి మాట్లాడుకోడాని కనుకునే వాళ్ళలో అతనొకడు. కాని ఏమిటీ అన్యాయం? హిందీ వద్దని ప్రజ తమని తామెందుకు తగలబెట్టుకోవాలి?వాళ్ళ హిందీ కనకనా – వాళ్ళతో హిందీ దగ్ధమై పోతుందనుకోడానికి? చావ దల్చిన వాళ్ళు యెలా చచ్చినా ఒకటే. కాని బ్రతకదల్చుకున్న సబిన్స్‌పెక్టర్ల నెందుకు కాల్చేయటం? ఇప్పటివరకూ టౌన్లో ఇన్‌సిడెంట్సు ఏవీఁలేవు కాని యీ వేళ ఏం కానుందో?

ఆలోచనల్లో కొట్టు పోతున్న నాయర్ని ఉదయం ఆఫీసు కొచ్చేసరికి బల్లమీదున్న ఎక్స్‌ప్రెస్ యఫ్.ఐ.ఆర్. భయపెట్టింది. ఆత్రంగా విప్పేడు. ఆదుర్దాగా చదివేడు. నిరాశగా బల్లమీద పడేసేడు దాన్ని, 'ఈ సినిమా వెధవకి చావడానికిదే టైము దొరికిందా?' అనుకుంటూ.

యఫ్.ఐ.ఆర్. చిన్నదే అనుమానితుల్ని చెక్ చెయ్యడానికి పక్కవూళ్ళు వెళ్తొస్తున్న హెచ్.సి 124 పట్నానికి మైలున్నర దూరంలో కారుపక్కన సిమెంటు రోడ్డు కడ్డంగా 36 ఏళ్ళ సిని మాల రాఘవయ్య చౌదరీ శవం పడివుండడం చూసేడు. రాఘ వయ్య గుండెల్లో బాకు గుచ్చుకొనివుంది. శవానికి గజం దూరంలో ఒక పర్స్ పడివుంది, పర్సులో

'టి.ఆర్. చౌదరీ అండ్ చౌదరీ టోబాకో ఎక్స్‌పోర్టర్స్' అన్న విజిటింగ్ కార్డులూ, రు.35 నోట్లూ వున్నాయి.

శవాన్ని ఆధీనంలోకి తీసుకుని అధికార్లకి మనవి చేసుకుం టున్నాడు హెచ్. సి. 124.

'ఎవడీ అర్థాయిష్షు చౌదరీ' అని నాయరు ఆలోచిస్తూం డగా వచ్చేడు సర్కిల్ రాజు. గది ఎత్తునా సాగిసలాఁకొట్టి కుర్చీలో కూర్చున్నాడు. ఆలస్యం చెయ్యకుండా చర్చలోకి దిగేరు ఆఫీ సర్లిద్దరూ.

"ఆర్మ్‌డు రిజర్వు కంటింజెంట్స్‌ని యెక్కడి కక్కడ సద్దేశాను సార్! మద్రాసులో అలజడి జాస్తి అయిందని యిక్కడ కూడా ఉబలాటం పెరిగిపోతుంది సార్. తెలిసిన గుండాలను డజను మందిని లాకప్పులో తోసేసేను సార్. కాని నిన్నటిలాగ యీ రోజు గడిచి పోతుందనుకోడానికి వీల్లేదు సార్, అన్ని కాలేజీల స్టూడెంట్లకి పక్కవూళ్ళ కాలేజీలనుండి గాజులూ, పసుపూ, కుంకం పార్సెల్స్ వచ్చేయి సార్ నిన్న. దాంతో రెచ్చిపోతున్నారు స్టూడెంట్సు. అన్ని కాలేజీలూ ఇవాళ స్ట్రయిక్ చేస్తాయట సార్. రైలుస్టేషనులోనే ఎక్కువ అలజడి జరుగుతుందని హెవీగా బందో బస్తు వేశేను సార్. రాత్రి జీ.టి. మెయిలూ వెళితేనేగాని దినం గడిచిందనుకోడానికి వీల్లేదుసార్" అని తాను చేసిన యేర్పాట్లూ, తనని భయపెడ్తున్న పరిస్థితులూ వివరించాడు రాజు.

తర్వాత చర్చ రాఘవయ్య ఖూనీకేసు మీదికి వెళ్ళింది.

'అక్కడి కెందుకు వెళ్ళాడండీ మీ హెచ్.సీ?' అమాయ కంగా అడిగాడు నాయర్.

"ఏం చెప్పమంటారు? నా ఖర్మ! హెచ్.సి బీటుకి వెళ్ళేలేదు. శవాన్ని చూడనూలేదు. తప్పతాగి లాకప్పులో పడుకున్నాడు రాత్రి. పొద్దున్నే యెవరో పాలమ్మాయి పల్లె నుండి వస్తూ చూసింది శవాన్ని. స్టేషనులో రిపోర్టిచ్చింది. శవాన్ని తానే చూసినట్టు బరికేశేడు, ఎఫ్.ఐ.ఆర్. మనవాడు రివార్డొస్తుందని. "ఖూనీ కేసులో ఖూనీ చేసినవాణ్ని పట్టుకుంటే వస్తుంది రా నాయనా రివార్డు, శవాన్ని పట్టుకుంటే రాదురా, అని యెన్నిసార్లు చెప్పినా నమ్మడు సార్. ఇలా రిజిస్టర్ చెయ్యడం ఇది నాలుగోసారి సార్" అన్నాడు రాజు.

కొంత చర్చసాగేక 'ఇన్‌వెస్టిగేషన్ సుబ్రహ్మణ్యానికి అప్ప గించండి. అతన్ని బందోబస్తులో వేస్టు చెయ్యొద్దు. తన్నుల్తిన డానికి, పళ్ళు విరగొట్టించుకోడానికి తెలివి తేటలున్న వాళ్ళక్కర్లేదు, మన త్రీటన్నర్సు చాలు' అన్నారు ఎ.ఎస్.పి. గారు (తెగ బలిసిన మిగతా సబిన్స్ పెక్టర్లకి ఆయన పెట్టిన ఉమ్మడి ముద్దు పేరు త్రీ-టన్నర్సు)

సుబ్రమణ్యాన్ని యిన్వెస్టిగేషనులోకి తోసేరు రాజు గారు. 'అస్తమానూ చాదస్తంగారిపోర్టు చెయ్యడానికి నాదగ్గిరకి రాకుండా నీకు తోచినట్టు యిన్వెస్టిగేటు చెయ్యి. రేపటి వరకూ బతికి బాగుంటే కలుసుకుందాం పోయిరా. విష్ యూ గుడ్ లక్!' అంటూ సాగనంపారు.

తంతంతా త్వరగా పూర్తి చేశేడు సుబ్రమణ్యం. శవాన్ని పంచాయితీ చేయించి ఆస్పత్రికి పంపించేడు. తర్వాత అసలైన యిన్వెస్టిగేషనులోకి దిగాడు. రాఘవయ్య కారు డేష్‌బోర్డులో పాతిక రూపాయల చిల్లరవుంది.

సుబ్రమణ్యం ముందు కలుసుకున్నది రామయ్యని. "డబ్బు సినిమాల్లోపెట్టి తగలేస్తున్నాడని లక్షా లేదన్నమాట వాస్తవమే. దాంతో ఈ వేళతో మన పార్ట్నర్‌షిప్ క్లోజ్. 'రేపులాయర్నీ, ఆడిటర్నీ తీసుకొస్తా. లెక్కలుసిద్ధం చేయించు' అని లేచిపోయేడు మా అన్నయ్య. అతడు వట్టి ఆవేశం మనిషి ఎలా వస్తుందో అలాగే పోతుందతని కోపం. అంచేత నేనేవీ మాట్లాడకుండా వుండిపోయేను" అని కథ ముగించేడు రామయ్య.

పంకజం ఏమీదాచలేదు. విస్కీ అమ్మిన లాడ్జింగ్ హౌస్‌వాడు 'మీ(దాసుకోనంటే చెప్తా' అంటూ అంతా చెప్పేశేడు సుబ్రమణ్యంతో.

ఇంతమంది నిజం చెప్పే యీ కేసులో ఏదో లిటిగేషన్ ఉండ లేకపోదనుకుంటూ సుబ్రమణ్యం యిల్లు చేరేసరికి మధ్యాహ్నం మూడైంది. తలుపు తీసిన రాధ తన్ని పరాయివాణ్ని చూసినట్టు చూస్తున్నాది. అంతవరకూ ఆమె భోంచెయ్యలేదు. జుట్టయినా దువ్వుకోలేదు. భోజనానికి కూర్చుని మర్డర్ కేసు గురించే చెప్పేడు సుబ్రమణ్యం భార్యతో.

"అయితే మీరు బందోబస్తులోలేరా?" ఆశగా నిట్టూర్చింది.

అప్పటికర్థమైంది సుబ్రమణ్యాని కామె ఆత్రం. సబిన్ స్పెక్టర్లను కాల్చేడం గురించి రేడియోవార్త ఆమె కూడా విని వుండాలి.

భోజనం తర్వాత "నీళ్ళలో పడేస్తే తడవను, నిప్పులో పడేస్తే కాలను. ఏం భయపడకు" అంటూ యూనిఫారం తొడుక్కుంటున్న సుబ్రహ్మణ్యానికి రాధ అందించింది రివాల్వరు.

❖ ❖ ❖

'ఇద్దరు సబిన్స్‌పెక్టర్లని దక్షిణాదిని ఆవేశపూరితులైన ప్రజ పెట్రోలుపోసి కాల్చేశేరు'.

ఈ మద్రాసు వార్తకి భయంతో వణికి పోయేరు పోలీసులు.

ఈ మద్రాసు వార్తకి ఆవేశంలో వణికిపోయేరు ప్రజ. భయ పడిన ప్రకారం అన్ని కాలేజీల స్టూడెంట్సూ స్ట్రైక్ చేశేరు. ట్రాఫిక్ బంద్ చేశేరు. అంగళ్ళు తెరవలేదు. బస్సులు షెడ్లల్లో జబ్బుచేసిన ఏనుగుల్లా పడున్నాయి.

ప్రైవేటుకార్లు గేరేజీల్లో జాతిజూలుకుక్కల్లా నిద్రలేవనే లేదు. పెద్ద డాక్టర్లు కూడా నడిచిపోయేరానాడు ఆస్పత్రులకి.

రిక్షాల్లేవు. రిక్షావాళ్ళానాడు దోపిడీచేసే పొట్టపోసు కోవాలి.

మందులుకూడా అమ్మలేదు. చావుపిలుస్తున్న రోగుల క్కూడా దొరక లేదు మందులు.

ఎక్కడ చూసినా పాముల్లాపాకే ప్రజావాహినులు.

ఎక్కడవిన్నా మిన్నుముట్టే నినాదాలు. దీన్నంతా ఎవరు ఆర్గనైజు చేస్తున్నారన్న విషయం తేలకుండానే వుండి పోయింది.

కాని... ఫలితం. మూడుసార్లు పోలీసులు కాల్పులు. ఇద్దరు పిల్లల్తోసహా ఆరుగురు మరణించేరు. రైల్వేస్టేషనుకి పెట్టిన

నిప్పువెంటనే ఆర్పివేయబడింది. కాని పోస్టాఫీసు దోపిడీ ఆపలేక పోయేరు. ఊరికి ఒక్కపక్క రైలుపట్టాలు లాగేయడంవల్ల ఒక గూడ్సు బండి తిరగబడింది. ఇంజను కిందపడి డ్రైవరూ, ఇంజను నిప్పులోబడి ఫైర్మన్నూ చనిపోయేరు.

సాయంత్రం అయేసరికి శ్మశానంలా వుంది ఊరు. చిన్న చిన్న ఊరేగింపులు నీరసంగా జరుగుతూనే వున్నాయి. ఆ రాత్రి రాబోయే మెయిలు తగలబెడతారన్న పుకారు పొగలా ఊరంతా కమ్ముకుంది.

సుబ్రమణ్యానికి ఆచూకి ఏమీ దొరకలేదు. పోస్టుమార్టం అయ్యేక డాక్టర్ని కలుసుకున్నాడు ఒక్క పోటుకే రాఘవయ్య చచ్చిపోయాడని. హంతకుడు ముందు నిలబడే పొడిచి వుండా లనీ, నేరం ఉదయం మూడూ నాలుగూల మధ్య జరిగి వుండా లనీ ఆయన చెప్పేడు.

రాఘవయ్యకు ఎవరూ శత్రువులున్నట్టు కనిపించలేదు సుబ్రహ్మణ్యానికి. రామయ్య ఒక్కడే అతని వారసుడు. అంతమాత్రం చేత రామయ్యే అతడ్ని పుణ్యం కట్టుకున్నాడనడానికి వీల్లేదు. ఈకేసు ముళ్ళు బహుశా హైద్రాబాదులో ఉన్నాయేమో?

రాఘవయ్య కారులో ఏవైనా క్లూస్ వున్నాయేమో? చీకటి పడుతూ ఉంటే ఇంజను మొదలు డిక్కీవరకూ సోదా ప్రారంభిం చేడు సుబ్రహ్మణ్యం. పాపం! టూ టౌన్ సబిన్స్‌పెక్టరు రెడ్డికి రాయిదెబ్బ తగిలి కన్ను పోయిదట. హెచ్‌సి. 124ని లాంఛన ప్రాయంగా ఒక మహామంత్రిగారి గడ్డిబొమ్మకి నిప్పంటించ మన్నారుట ప్రజ. రివార్డుకి ఆశపడుతున్న అతను నిరాకరిం చేడట, ఆతని చెయ్యి విరిచేశారట! పాపం! కాని కొంతనయం! పెట్రోల్లో తడిపి నిప్పంటించ లేదు.. చటుక్కున సిగరెట్టు నేలకి కొట్టి కాలితో నొక్కేశాడు సుబ్రమణ్యం ఆలోచనల్లో మునిగి నోట్లో సిగరెట్టుండగానే పెట్రోలు డబ్బామూత తీసేడు... ఒక గండం గడిచింది. రాధ ఎందుకూ ఒక్కరోజులో నీరసించి పోయింది? అనవసరంగా తనగురించి ఆందోళన పడుతుంది. తనకి వడ్డిస్తున్నంతసేపూ ఒక్కమాట కూడా మాట్లాడలేదు. ఐనా అనవసరంగా కంగారుగాని ఎక్కడో దక్షిణాదిని ఎవర్నో తగల బెడితే ఇక్కడకూడా అలా జరుగుతుందా? అనవసరంగా కంగారు పడుతోందామె. ఏది, పెళ్ళయి యింకా పట్టుమని నాలుగేళ్ళయినా పూర్తవందే? మరో పదేళ్ళపోతే ఆమే ధైర్యం చెబుతుందది తనకి తాను రిటైరయ్యేక రాధ మనుమల్తో తన సాహసగాథలూ, తాను పట్టిన కేసులూ చెబుతున్న భావిదృశ్యం అతని కళ్ళముందు నిలిచింది. తనలో నవ్వుకున్నాడు. పెద్దదై పోయినా పండు బాదంఆకులా రాధ అంత అందంగా ఎందు కుంది తన దృష్టిలో.

సాయంత్రం కలెక్టరుగారి యింటి ఆవరణలోనే కాల్పులు జరిగేయి. ఆర్మీ యూనిట్స్‌లేందే ప్రభుత్వం నడపలేనని కలెక్టరు గారు వైర్లెస్‌మెసేజ్ పంపేరు?

ఆవేళ ప్రభుత్వం చచ్చిపోయింది (ఆవూళ్ళో) అరాచకం రాజ్యం చేసింది.

ప్రాణాల మీద ఆశ ఉన్నవాళ్ళు యిళ్ళు కదల్లేదు. గవర్న మెంటు ఆస్తులు తగలబెట్టటంతో ప్రారంభించిన అలజడి సాయంత్రం అయేసరికి షాపుకార్లను దోచుకోవడంగా మారి పోయింది. తమ ఆస్తే కాపాడుకోలేని ప్రభుత్వానికి ప్రజల ఆస్తిని కాపాడేశక్తి లేకపోయింది. ఐనా శక్తివంచన లేకుండా పని చేస్తున్నారు పోలీసులునాడు వారెవరూ భోంచెయ్య లేదు. వాళ్ళలో చాలామంది మంచి నీళ్ళకికూడా నోచుకోలేదు.

రాత్రి 8–30 దాటింది. కంపెనీలోవున్న రామయ్యని మళ్ళీ ప్రశ్నించి బయలు దేరేడు సుబ్రమణ్యం మోటారుసైకిలు మీద, అతని మనసు కేసుమీదలేదు. పాపం! దెబ్బలుతిని ఆసుపత్రిలో వున్న తన సహచరుల గురించిన ఆలోచనలు తలలో చిక్కుపడు తున్నాయి. కన్నుపోయిన రెడ్డీ. చెయ్యి విరిగిన హెచ్ సి. 124... బాధతో ఎన్ని మెలికలు తిరిగిపోతున్నారో! వీరు చేసిన ద్రోహం ఏమిటి? హిందీ కావాలన్నారా? నిరాకరించేరా? ఇంగ్లీషుకి ఆరాధనగా వత్తిలా తమని వెలిగించినందుకు ప్రజలకి కృతజ్ఞులై వుండాలి కాబోలు పోలీసులు! నిండు ప్రాణానికి నిప్పుపెట్టే ప్రజకి ఇంగ్లీషు మాత్రం ఎందుకు? వారికి కావలసినది పైశాచిక భాష, రాక్షసలిపి.

చెయ్యి ఒక్కసారి కాలింది సుబ్రమణ్యానికి. పెట్రోలు పోసి అంటించినట్లనిపించింది. కుడివేళ్ళమధ్య సిగరెట్టు కాలిచిన్నదై వేళ్ళు చురికేయి. సిగరెట్టు బలంగా నేలకి కొట్టేడు. చిన్న పొక్కు ఎక్కివుంటుంది ఒళ్ళంతా యిలా పొక్కులు ఎక్కితే? కాలే నీరుతో మెత్తటి బొబ్బలు ఒళ్ళంతా కడితే ఎలా భరించడం? ఏమిటి పాడు ఆలోచన? ఈ రాష్ట్రంలో ఎవర్నీ తగలబెట్టలేదే? ఏమో. అరాచకం అంటువ్యాధి.

చిన్నపొక్కయినా వేలంతా మండిపోతోంది. ఒక నాడు రాధ కాలిమీద మరుగుతున్న నీళ్ళు వలికేయి. ఎంత భయంకరంగా అరిచింది ! ఆ అరుపులో మనిపిగొంతు లేదు. ఆ ఆర్తనాదానికి చైతన్య రహితుడైపోయేడు... ఆ సబిన్స్‌పెక్టరూ అలాగే అరిచేరా?... ఇంకా భయంగా ఇంకాబాధగా అరిచి ఉంటారా?... కేక విన్నాక కొన్ని క్షణాలవరకూ కుర్చీలోంచి లేవలేకపోయేడు. చైతన్యం వచ్చేక రాధ దగ్గరికి పరిగెత్తేడు. ఆమె కాలు కప్పలా వాచి పోయింది. కాలుని పట్టుకొని బిత్తరగా చూస్తోంది రాధ. ఆమె కళ్ళలో నీరు లేదు.... ఆ సబిన్స్‌పెక్టర్లు కూడా ఏడ్చి వుండరా? భరించలేని బాధ కన్నీటిని యింకించి వేస్తుందా?

సడన్‌బ్రేక్ వేశాడు సుబ్రమణ్యం. టైరు ఏడుస్తూ మోటరు సైకిలు ఆగిపోయింది. ఏమిటి తన దారికి అడ్డంగా పరిగెత్తింది? నక్క కాబోలు!

ఒక్కసారి భయం ఆవహించింది. నొసలు చెమటతో తడిసి పోయింది. యూనిఫారం వంటిని మంట పెడుతుంది. మోటారు సైకిల్‌స్టార్ చేయ్యబోయినప్పుడు కాళ్ళు తడబడ్డాయి. చెయ్యి వణికింది. లేని ధైర్యం తెచ్చుకున్నాడు. ఇంకేముంది? రెండుమైళ్లు. వచ్చేసినట్టేవూరు. మోటారు సైకిలు నిండు శబ్దం కొంత ధైర్యంయిస్తున్నాది. కాని ఏదో నల్లటి భయం. ఎక్కడో ఎర్రటి మంటలు. పెట్రోలు వాసన కాలే మాంసం ఉడుకుతున్న కంపు.

ఏమిటామంట? పల్లెశ్మశానంలో ఊడలమర్రిపక్క ప్రశాంతంగా కాలుతోందో శవం. ఎర్రటిమంటకి సన్నవి మర్రి ఊడలు తెగిన రక్తసిక్తమైన నరాల్లా వేలాడు తున్నాయి. ఎవరో దిక్కు మాలిన చావైవుండాలి. శ్మశానంలో ఎవరూ లేదు, బ్రతికుండగానే కాల్చేయలేదు కదా?

సాగిపోతున్నాడు సుబ్రమణ్యం. చీకటి తన వెనుక పేరుకుంటుంది. ఎదురుగా ఏవో నీలినీడలు--ఆకారంలేనివి. గమ్యం లేకుండా కదులుతున్నాయి. పక్కపొలంలో ఒంటితాడి దెయ్యంలా నిశబ్దంగా నవ్వుతూంది.

ఏమిటా మంటలు? నిప్పు వేయి నాలుకలతో ఆకాశాన్ని నాకుతూంది భగవాన్? ఊరు తగలబడిపోతూంది. తల తిరుగుతోంది. ఒళ్ళు వశం తప్పుతోంది. చేతులు పట్టు తప్పి పోతున్నాయి.

అయినా సాగిపోతున్నాడు ఊరు కొన్ని ఫర్లాంగులు మాత్రమే వుంది. ఈ మలుపు తిరిగితే రైలుస్టేషను అడ్డరోడ్డు వచ్చేసినట్టే. మలుపు తిరిగేడు. జీవితమే మలుపు తిరిగినట్టయింది. మలుపు తిరగ్గానే రోడ్డుమీద ఎవరో పేర్చిన రాళ్ళను గుద్దెయ్య వలసిందే సైకిలు. ఎంత గట్టిగా బ్రేకుతన్నినా రాళ్ళను ఢీకోక తప్పదు. అంచేత బ్రేకువేసి రోడ్డు పక్కకి తిప్పేశేడు హేండిల్‌బార్. రోడ్డువార చెట్టుపక్క ఆగింది సైకిలు. ఏమాత్రం అజాగ్రత్తగా వుండినా నిండు ప్రాణాలు ఎగిరిపోయి వుండేవి. చెట్టుపక్క నుండి రాళ్ళనిదాటి అవతల పక్కకి పోవాలి. ఎవరు పేర్చారో ... రోడ్డుకడ్డంగా ... అన్ని రాళ్ళు!

సమాధానంగా నాలుగునీడలు అతన్ని చుట్టుకున్నాయి. మెడమీద గుద్దు, డొక్కలోపోటు, కంటిమీద దెబ్బ - దేముడి అనుగ్రహంవల్ల స్పృహతప్పిపోతోంది - ఎవరో జేబులు తడుము తున్నారు. అంతా చల్లబడిపోతోంది.. ఏమిటి వాసన?- పెట్రోలు.

తుపాకీ శబ్దంచేస్తూ అగ్గిపుల్ల కాగడాలా వెలిగింది. తర్వాత?-- తర్వాత?

మంటలు కక్కుతున్న బంతిలా --గమ్యంలేకుండా -- తిరిగి రాకుండా పరిగెత్తేడు సుబ్రమణ్యం. ఒకకేక --- హృదయాన్ని చీల్చే ఆక్రందనం --భాషలూ లిపులూ లేనప్పటి నుండి, దేశాలకు ఎల్లలు ఏర్పడని పూర్వంనుండి. అనాదిగా, బాధతో మానవుడు బాషలేని నోటితో సృష్టికర్తకు చేసుకునే విన్నపం --విలాపం-- ఆ అంధకారంలో ఎవరు విన్నారు?

రాత్రి ఒంటిగంట దాటింది. క్వార్టర్సుచుట్టూ చీకటి సుళ్ళు తిరుగుతోంది. బొమ్మరిల్లులాంటి క్వార్టర్సుముందు తడకల ఆవరణలో భర్త రాకకోసం ఎదురుచూస్తూ పుస్తకం చదువుకుంటోంది రాధ. దూరానతుపాకుల చప్పుళ్ళూ, మలుపులు తిరిగే లారీల మొర, కాలేయిళ్ళు చేసేధ్వనులు, అస్పష్టమైన సముద్ర ఘోష లాంటి ప్రజహోరు ఆమెను కలిచివేస్తున్నాయి ఆమె పేగులు ఎవరో యినపచేత్తో పట్టుకొని తిప్పుతున్నట్టనిపించింది. మొండిగా ధైర్యం తెచ్చుకుంటూంది. కాని భయానికి లొంగినప్పుడు మాంగల్యం కళ్ళకద్దుకుంటోంది.

తడకల తలుపు తీసిన చప్పుడు భయం గూడుకట్టుకున్న ఆమె చెవులను బద్ధలు చేసింది. ఉలికిపడి నిల్చుంది. ఆశ, భయం ఒక్కసారి ఆమెని అపహాస్యం చేసేయి.

ఎత్తని తలల్తో ప్రవేశించేరు నాయరూ, రాజా వెనక చీకట్లో ఎవరో వుండిపోయారు. కొన్ని క్షణాలు యెవరూ మాట్లాడలేదు. తట్టుకోలేని నిశ్శబ్దంలో రాధకి తన గుండె చప్పుడే భయంకరంగా

విన్పిస్తోంది. ఎవరూ మాట్లాడరేం. ఈ మోయలేని నిశ్శబ్దాన్ని యెవరూ యెందుకు తోలివేయరు !

దుఃఖంతో పూడ్చుకుపోయిన గొంతుకతో అతికష్టం మీద చెప్పగలిగేడు రాజు 'మణి మనకింక లేదు తల్లీ--' అంతే - పిడికిలితో నొసట బలంగా గుద్దుకున్నాడు.

రాధ ఏమీ మాట్లాడలేదు. అచేతనంగా కుర్చీలో కూలబడి పోయింది.

నాయర్నీ, రాజునీ తడకల్నీ తప్పించి చీకటిలోకి దూరంగా చూస్తూ కూర్చుండిపోయింది.

చితికిన ఆశను పొందిక చేసుకుంటూ అడిగింది "ఎలా, ఎలా?"

మాట్లాడే శక్తిని తొలగించింది భయం. జవాబుగా నిశ్శబ్దం నిట్టూర్చింది.

చీకటి భయకరంగా కదిలింది. ఆమె కంట నీరులేదు. ఆమె నోట పలుకులేదు. మానవ సహజమైన భయం, క్లేశం, బాధా ఆమెని వదిలిపోయేయి. అప్పడామె దేవతామూర్తిలా కని పించింది వారిరువురికి.

కాని చీకటిలోకి చూస్తూనేవుంది. దేన్ని, ఏమికని పించిం దామెకు? ఏమిటి చూడగలుగుతోంది? పచ్చటి శరీరంతో కాంతులుజల్లే కళ్ళతో 'నీళ్ళల్లో పడేస్తే తడవను, నిప్పులో తోస్తే కాలను' అని తన ఎత్తయిన ముక్కు చిట్లిస్తూ అందంగా వంకర పోయే పెదిమల్తో నవ్వుతూ తనవద్ద రివాల్వరు తీసుకుంటున్న సుబ్రమణ్యమా?'

నల్లగాకాలి, వెనక్కి విరిగిన ఎడమ చేత్తో, పొలం గట్టున వేళ్ళతో మేఘాల్లా మెదిలే భగవంతుని నిందిస్తున్న తన మణా?-

ఆయన ఎత్తయిన ముక్కుకి బదులుగా యేర్పడిన భయకర రంధ్రమామెకు కనిపించిందా?

ఒకనాడు అందంగా ఆకర్షణీయంగా నవ్వి నవ్వించ గలిగే అతని పెదవులు వాచి పుళ్ళుపడి ఆందరహితంగా విడి పోవడం ఆమె చూడగలిగిందా?

ఆనందంతో ఆరోగ్యంతో మెరిసే అతని కళ్ళు పేలి బొగ్గులై ఆకాశంలో దేముణ్ని భయంగా అసహ్యంగా చూస్తూ కనిపిం చేయా ఆమెకు?

తేనె పలుకుల్తో ఒకనాడు తన చెవులు నింపిన నాలిక యిప్పుడు వికృతంగా పక్కకి వేలాడ్డం కన్పిస్తోందా? ఏమో? కేసు రిజిష్టరయింది, నాయరు స్వయంగా దర్యాప్తు చేశాడు. కేసు దైరీకి ఆవేశం నాంది పలికింది. నిరాశ తుది సంతకం చేసింది.

❖ ❖ ❖

**దర్యాప్తులో తేలని విషయాలు :** చావుకుముందు సుబ్రహ్మణ్యం రామయ్య ఆఫీసులోకి అడుగు పెట్టేడు.

'రండి, రండి' అంటూ ఆదరంగా ఆహ్వానించేడు రామయ్య. శవం దగ్గర పుడివున్న పర్సులో 'టి.ఆర్. చౌదరి' అన్న విజిటింగ్ కార్డులూ, టొబేకో కంపెనీకి ఆ ముందు రెండు రోజుల్లో బేంకు ల్నించి వచ్చిన ఓవర్ డ్రాఫ్టు కట్టమన్న ఉత్తరాలూ ఉన్నాయి. అవి రాఘవయ్యకే అనుకున్నాడు. ఆ పర్సుమీద టొబేకో కంపెనీ పేరు కూడా బంగారం అక్షరాలతో అచ్చుకొట్టివుంది.

కాని ఇందాక ఆ కారు సోదా చేస్తూవుంటే ఫ్రంటు సీటు కుషన్సులో అలాటిదే మరోపర్సు దొరికింది. అందులో రూ. 1,500 లు దాటివుంది పైకం. 'టి. రాఘవయ్య చౌదరీ, చౌదరీ అండ్ చౌదరీ, టొబాకో ఎక్స్‌పోర్టర్స్' అన్న కార్డులూ, 'టి. రాఘవయ్య చౌదరీ, ట్రయో పిక్చర్సు, హైదరాబాదు' అన్న కార్డులూ కూడా వున్నాయి. అంటే చనిపోయినాయన రాత్రి ప్రయాణం చేయడంవల్ల కావలసిన పైకం రు.25లూ డేష్ బోర్డులో పెట్టి, మిగతా పైకం పర్సులో పెట్టి దాచేశాడు.

"ఒకే మనిషికి రెండు పర్సులుండవు. ఒకే రకమైనవి రెండు వుండవు. శవం దగ్గర పర్సుకాక కార్లో మరో పర్సుంది చూడండి" అంటూ రామయ్యకి రెండో పర్సు చూపించాడు సుబ్రహ్మణ్యం. రామయ్య చూశాడు.

"క్షమించండి, ఇప్పుడే వచ్చేస్తా. బయట మేస్త్రీలు కాసు క్కూర్చున్నారు నాకోసం" అని బయటకు వెళ్ళాడు రామయ్య.

అతను తిరిగి ఆఫీసులోకి వచ్చిన వెంటనే అతని అను చరులు నలుగురు రెండు పెట్రోలు డబ్బాలు పట్టుకొని జీపులో ఎక్కడికో వెళ్ళిపోయేరు.

సుబ్రమణ్యానికి చాలా నచ్చచెప్పేడు రామయ్య. "మా అన్న య్యకి పర్సులంటే సరదా. ఒకేసారి మూడు నాలుగు కూడా వాడతాడు. బేంకు ఉత్తరాలు నేనే యిచ్చేనాయనికి. కంపెనీ వ్యవహారాలు తానుకూడా కొన్నాళ్ళు చూస్తానన్నాడు. బేంకు ఏజంట్సుతో అతనే మాట్లాడుతానన్నాడు... జీవితంలో తప్పులు చేయలేదని అనను. కాని అన్నను ఖూనీ చేసేటంత నీచుణ్నికాను ఇనస్పెక్టరు గారూ!"

రెండు పర్సులుంటే వుండొచ్చు. కాని దేష్ బోర్డులో డబ్బు? చిక్కులూ, ముళ్ళూ చాలా వున్నాయనిపించింది సుబ్రమణ్యానికి.

"నేను ఏమీ అనను. కాని రెప్పొద్దున్న ఒకసారి స్టేషనుకి రండి" అన్నాడు సుబ్రహ్మణ్యం లేస్తూ.

"తప్పకుండా" అంటూ చిరునవ్వుతో సాగనంపాడు రామయ్య.

"దేరీజ్ నో పెర్ ఫెక్ట్ క్రైమ్" అనుకున్నాడు రామయ్య సుబ్రమణ్యం మోటారు సైకిలు స్టార్టు చేస్తూ వుంటే.

"బట్ వన్ క్రైమ్ కెన్ మేక్ ఎనదర్ పర్‌ఫెక్టు" అన్న ఆలోచన వచ్చినప్పుడు రామయ్య మొహం కలువలా విడింది.

❖ ❖ ❖

హిందీకి విరుద్ధంగా గూండాలు చేసే అలజడిని పూర్తిగా ప్రభుత్వం అణచివేసింది. చనిపోయిన సబిన్స్‌పెక్టరు గారి భార్యకి గవర్నమెంటు రూ. 10,000 లు విరాళం యిస్తామని ప్రకటించింది – ఆకాశవాణి వార్తలు.

ఆమె కుంకుమ ఖరీదు పదివేలు !?

**(విశాఖ విరసం, 65 1.4.1965)**

# డిటెక్టివ్ లెసన్ నెం.1

డిటెక్టివ్ అప్రెంటిస్ ప్రసాద్ నాలుగోసారి అద్దంలో చూసుకొని తన టెరిలిన్ టైముడి సరిచూసుకొన్నాడు. ఉదయం ఎనిమిద యింది. అతను ప్రఖ్యాత అపరాధ పరిశోధకుడు అవినాశ్ బాబు వద్ద నిన్ననే ఉద్యోగంలో ప్రవేశించేడు. అవినాశ్ బాబు కోరికపై అతనింట్లోకే బస మార్చేడు.

నిన్ననే చెప్పేడు అవినాశ్ బాబు మొదటిపాఠం 'కళ్ళు పెట్టి చూడు, చూసిందాన్ని బట్టి చూడనిది గ్రహించు' అని ఉదాహరణలు యీ ఉదయం చెప్తానన్నాడు అవినాశ్.

ప్రసాద్ టైముడితో రాజీపడి అవినాశ బాబు గదివేపు నడిచాడు, గది ఖాళీగా వుంది. అవినాశ్ బాబు లేబొరేటరీలో వుంటారని గ్రహించాడు ప్రసాద్! తరువాత లేబొరేటరీకి వెళ్ళి చప్పుడుకాకుండా తలుపు తెరిచాడు. పొడుగాటి లేబొరేటరీలో రెండో వేపు. అవినాశ్ బాబు ఏదో ప్రయోగంలో నిమగ్నుడయి వున్నాడు, అతని వీపు ద్వారం వేపున్నా "రావోయ్ రా ! కూర్చో" అని ఆయన ఆహ్వానించగానే తనరాక యెలా కనిపెట్టేశాడా అని ఆశ్చర్య పడుతూ ప్రసాద్ లోపలికి ప్రవేశించాడు.

ఆరడుగుల ఎత్తున్న డిటెక్టివ్, ప్రసాద్‌వేపు నడిచి వచ్చేడు. ఒక చేతిలో టెస్ట్‌ట్యూబ్ బుస కొడుతున్నది. రెండవ చేతిలోవున్న బీకరులో ఏదో ఎర్రటి ద్రవం వుంది.

"కూర్చోవోయ్ కూర్చో!" అంటూ ప్రసాద్‌ని వొక కుర్చీలో కూర్చోపెట్టి, టెస్టుట్యూబ్‌ని బీకర్ని బీరువాలో పెట్టి ప్రసాద్ ముందు టేబిల్ మీద వోరగా కూర్చొని ప్రసాద్ వేపు చూచి నవ్వాడు అతను.

"నీ రాక ఎలా కనిపెట్టేనా అనే కాదోయ్ ఆలోచిస్తున్నావ్?" అని ప్రశ్నించాడు.

"కరెక్టు సార్!" అన్నాడు ప్రసాద్.

"తలతిప్పకుండా వెనక్కి చూడ్డం నేర్చుకోవాలి"

"ఎలాసార్ !"

"ముందు అద్దం పెట్టుకుంటే సరి!"

"మీ ముందు అద్దం లేదే !"

"అద్దంలా పనిచేసే గాజు తలుపుల బీరువా వుందికదా!"

"ఓస్! ఇంతేనా అపరాధపరిశోధన?" అని అన బోయి మానేశేడు ప్రసాద్.

"నువ్వు షిప్ మార్కు చిన్న అగ్గిపెట్టెలు వాడుతున్నావు కదూ?" అని అవినాశ్ బాబు అంటే ప్రసాద్ ఆశ్చర్యానికి మేరలేకపోయింది.

"ఎలా కనిపెట్టేసేరు సార్?" అని అడక్కుండా ఉండ లేక పోయాడు ప్రసాద్.

"చాలా సులువు. నీకు ఫేషన్లంటే యిష్టమని నీ టెరిలిన్ టై, షర్టూ నీ షర్టు, జేబులో ఉన్న 20 సిగరెట్ల ప్లేయర్స్ సిగరెట్టు పెట్టె చెప్తున్నాయి. షిప్ మార్కు చిన్న అగ్గిపెట్టెలు సిగరెట్లు కాల్చేవారికోసం ప్రత్యేకం తయారు చేస్తారు మామూలు అగ్గిపెట్టెలకంటే ఖరీదుకూడా జాస్తి. అవి యీ ఊళ్ళో అమ్మడం మొదలు పెట్టి 15 రోజుల యింది. నీకంట అవి పడకుండా వుండి వుండవని అనుకున్నా."

నిశ్చయంగా అవినాశ్ బాబు అఖండ ప్రజ్ఞాశాలి అని గ్రహించాడు ప్రసాద్.